క్లుప్తంగా

రాత పరీక్షల్లో తప్పిదాలను సరిచేయాలి

కొల్లాపూర్: ఎస్‌ఐ, పోలీసు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన రాత పరీక్షల్లో జరిగిన తప్పిదాలను సరిచేయాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శివవర్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కొల్లాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నాపత్రంలో చోటుచేసుకున్న తప్పులకు మార్కులు కలపడంతో పాటు, ఈవెంట్లలో డిజిటల్ విధానాన్ని రద్దుచేసి, మ్యానువల్ విధానాన్ని కొనసాగించాలన్నారు. లేకుంటే డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామన్నారు. సమావేశంలో మహిమూద్, రామకృష్ణ, చందు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు విద్యార్థిని ఎంపిక



ఉప్పునుంతల: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థిని భవాని ఈ నెల 9, 10, 11 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్మల్ జిల్లాలో జరుగనున్న సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనడానికి ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయుడు పోకల సతీష్ గైడెన్స్‌లో విద్యార్థిని భవాని తయారు చేసిన పెల్టియర్ బ్లాంకెట్‌ను రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించనుందన్నారు. ఈ మేరకు విద్యార్థిని భవాని, గైడ్ టీచర్‌ను హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



అచ్చంపేట రూరల్: క్రీడారంగానికి, వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రతిఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎడ్మ శ్రీను యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలో 35 నుంచి 90 సంవత్సరాల వ్యాయాయ ఉపాధ్యాయులు, సీనియర్ వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు. పరుగు పందెం, వాకింగ్, లాంగ్‌జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్, షార్ట్‌పుట్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం జిల్లా ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదలకు స్వచ్ఛమైన తాగునీరు



కల్వకుర్తి రూరల్: మండలంలోని తోటపల్లిలో గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, సర్పంచ్ శ్రీలతరాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ సురక్షితమైన నీటిని తాగాలని కోరారు. సర్పంచ్ శ్రీలతరాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటంతో పాటు సురక్షితమైన నీటిని తాగడం కోసం ఈ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నరేష్‌గౌడ్, రాజేష్‌రెడ్డి, పురుషోత్తంరావు, శ్యాంసుందర్, శ్రీనివాసారావు, రామరెడ్డి పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో సత్తాచాటుతా

కల్వకుర్తిరూరల్: రాబోయే ఎన్నికల్లో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ సత్తా చాటడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అర్జున్‌రెడ్డి చెప్పారు. ఆదివారం మండలంలోని తోటపలి, జీడిపల్లి గ్రామాల్లో పర్యటించి యువకులు వృద్ధులతో మాట్లాడారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు పార్టీపై అభిమానం చూపుతున్నారన్నారు. సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు షర్మిలతోనే సాధ్యమని అర్జున్‌రెడ్డి వివరించారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం తక్కువ సంఖ్యలో భక్తులు హాజరై మైసమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వ్యవసాయ పనులు ఉన్నందున రైతులు, వ్యవసాయ కూలీలు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. 3 వేల మంది భక్తులు మాత్రమే హాజరయ్యారు. భక్తుల టికెట్లు హుండీ ద్వారా రూ.లక్ష ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ అధికారులు సత్యచంద్రారెడ్డి, చైర్మన్ శ్రీనివాసలు తెలిపారు.

మీ-సేవలు ప్రారంభమయ్యేనా?

- 17 గ్రామపంచాయతీల్లో నిరుపయోగం
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పెద్దకొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మీసేవ ద్వార దరఖాస్తులు చేసుకునేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలను ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండలానికి 2019-20 సంవత్సరంలో 17 గ్రామపంచాయతీలకు 17 మీ-సేవ కేంద్రాలు మంజూరయ్యాయి. రూర్బన్ మిషన్ పథకం ద్వారా ఒక్కొక్క మీ-సేవ కేంద్రం నిర్మాణానికి రూ.7.50 లక్షలు మంజూరు చేశారు. మీ-సేవ కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తయితే రెండేళ్లు గడిచినా.. నేటికి ప్రారంభించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కేంద్రాలకు అవసరమయ్యే కంప్యూటర్లు, టేబుల్స్, ప్రింటర్లను రూర్బన్ మిషన్ పథకంలో కొనుగోలు చేసి మీ-సేవ కేంద్రాలకు అప్పగించారు. నెట్ కనెక్షన్ లేక కొన్ని గ్రామాల్లో అధికారులు పట్టించుకోక నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో రైతులు, విద్యార్థులు మీ-సేవ కేంద్రం ద్వారా రకరకాల దరఖాస్తులు చేసుకునేందుకు మండల కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న మీ-సేవ కేంద్రాలను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

మీ-సేవ కేంద్రాలు ఇలా..

పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, చిన్నకొత్తపల్లి, చిన్నకార్పాముల, యాపట్ల, మారేడుమాందిన్నె, సాతాపూర్, కల్వకోల్, చెన్నపురావుపల్లి, గంట్రావుపల్లి, నారాయణపల్లి, జొన్నలబొగుడ, తిరుమలాపూర్, వెనచర్ల, ముష్టిపల్లి, మర్రికల్ గ్రామాల్లో మీ-సేవ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.



పెద్దకొత్తపల్లిలో నిరుపయోగంగా ఉన్న మీ-సేవ కేంద్రం

మండల కేంద్రానికి వెళ్తున్నాం...



గ్రామాల్లో రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు మీ-సేవ కేంద్రాలు పనిచేయకపోవడంతో మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తులు చేసుకుంటున్నారు. గ్రామాల్లోని మీ-సేవ కేంద్రాలను ప్రారంభిస్తే రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి.

– లింగస్వామి, రైతు, పెద్దకొత్తపల్లి

నెట్ కనెక్షన్లు ఇచ్చి ప్రారంభిస్తాం..



కొన్ని గ్రామపంచాయతీల్లో నెట్ కనెక్షన్లు లేవు. వాటికి నెట్ కనెక్షన్లు ఇప్పించి త్వరలో 17 గ్రామపంచాయతీల్లో మీ-సేవ కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కృష్ణయ్య, ఎంపీడీఓ, పెద్దకొత్తపల్లి

‘మిషన్ భగీరథ పథకం అమలు శూన్యం’

ఉప్పునుంతల: ఇంటింటికి శుద్ధ జలాన్ని అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్న మిషన్ భగీరథ పథకం గ్రామాల్లో ఏమాత్రం అమలు కావడంలేదని శుభ్రంగా లేని ఆ నీటిని ఏ ఒక్కరూ తాగడంలేదని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆరోపించారు. ఆదివారం ఉప్పరిపల్లిలో మిషన్ భగీరథ కొళాయిల వద్ద భగీరథ నీటి కోసం వేచిచూస్తున్న మహిళలతో ఆయన మాట్లాడారు. తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు అంతా ఒండు నీరు వస్తుండటంతో గ్రామాల్లో ఆ నీటిని దుస్తులు ఉతకడానికి, ఇతర అవసరాలకు వాడుతున్నారే తప్పా తాగడానికి ఏ ఒక్క కుటుంబం ఉపయోగించడంలేదన్నారు. సీఎం కేసీఆర్ మాత్రం భగీరథ నీటి గురించి గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. కమీషన్లు, కాంట్రాక్టర్ల కోసం రూ.1.20 లక్షల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అచ్చంపేట నియోజకవర్గంలో 40 శాతం గ్రామాలకు ఇప్పటికి భగీరథ నీరు అందడంలేదని తెలిపారు. ఏళ్ల తరబడిగా పనులు చేపడుతున్నా.. ఇప్పటికీ తాగునీటిని సరిగా అందించలేకపోయారని అన్నారు. డీసీసీ అధ్యక్షుడితో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, శేఖర్‌గౌడ్, రేణయ్య, తిర్పతయ్యగౌడ్, హరినారాయణగౌడ్ ఉన్నారు.



ఉప్పరిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

కొనసాగుతున్న పాదయాత్ర

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, గోపులాపూర్, సింగవరం, కొండూరు గ్రామాల్లో ఆదివారం ప్రగతి కోసం పాదయాత్ర కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ కోసం నిత్యం పోరాడి మన పిల్లలు ప్రాణాలు త్యాగం చేసి తెలంగాణ తెచ్చుకుంటే ఫలితం లేకుండా పోయిందన్నారు. కొల్లాపూర్‌లో కూడా ఏ నాయకుడిని గెలిపించుకున్న అదే పరిస్థితి ఉందని, అభివృద్ధి పరంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని, ఎవరికి వారే దోచుకోవడం సరిపోతుందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ మంత్రులపై ఆయన మండిపడ్డారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ రావడం ఖాయమని కొల్లాపూర్‌లో కూడా బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల, జీవనజ్యోతి, గ్రామ పంచాయతీ 14, 15 ఫైనాన్స్ నిధుల గురించి ఆయా గ్రామాల ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. కొల్లాపూర్‌లోని ప్రతి గ్రామంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామని, ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకుంటుంటే బాధేస్తుందన్నారు. కొల్లాపూర్‌లో ఎమ్మెల్యేగా నేను గెలిస్తే ఏ గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా నిత్యం ప్రజల వెంట తిరుగుతూ నియోజకవర్గానికి కృషి చేస్తానని కొండూరులోని దూందాం కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో భరత్‌చంద్ర, ప్రసాద్, మూలె వెంకటేష్, శ్రీనివాస్‌యాదవ్, విష్ణు, కంటె వెంకటస్వామి, ఖలీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



గోపులాపూర్‌లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటూ పాదయాత్ర చేస్తున్న సుధాకర్‌రావు

విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలకి చెందిన వినయ్‌కుమార్ ఉన్నత చదువులకు లండన్ దేశానికి వెళ్తున్నాడు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి ఆ విద్యార్థికి విమాన ఖర్చులకు ఆర్థికసాయం సమకూర్చారు. ఆదివారం గ్రామ పెద్దలు వినయ్‌కుమార్‌కు ఆర్థిక సహకారం అందజేశారు. నిజాముద్దీన్, సుధాకర్‌రెడ్డి, శామెల్, రామానుజన్, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కల్వకుర్తిలో ఆర్థికసాయం అందజేస్తున్న పెద్దలు

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి: మున్సిపాలిటీ పరిధిలో మృతిచెందిన నారాయణ, ఎల్లమ్మ, దుర్గయ్య, నిరంజన్, ఎల్లయ్య కుటుంబాలను ఆదివారం మున్సిపల్ చైర్మెన్ ఎడ్మసత్యం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ శ్రీశైలం, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సిద్ధప్ప, మల్లయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి మరమ్మతు చేపట్టాలి



తాడూరు: మండలంలోని నాగుదేవుపల్లిలో వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పాఠశాల భవనం కూలింది. దీంతో పాఠశాల నిర్వహణ భారంగా మారింది. పాఠశాలకు వెళ్లే పేద విద్యార్థులు ఎన్నో కష్టాలకు ఓర్చి ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాత్కాలిక మరమ్మతు నిర్వహించి పాఠశాలను తిరిగి పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

హిందువుల్లో చైతన్యం తేవాలి

కల్వకుర్తి రూరల్: కొంత మంది హిందూ సమాజాన్ని దేవుళ్లను అవహేళన చేస్తూ హిందూ మతాన్ని కించపరుస్తున్నారని, హిందువుల్లో చైతన్యం కోసం ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకుడు గిరిధర్‌రెడ్డి, దయాకర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలి భవనంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో బజరంగ్‌దల్ దుర్గావాహిని కమిటీలను ఎన్నుకున్నారు. కల్వకుర్తి బజరంగ్‌దల్ మండల అధ్యక్షుడిగా దేవర్ల అంజి, పట్టణ అధ్యక్షుడిగా సాయి, దుర్గావాహిని కమిటీ అధ్యక్షుడిగా సుకన్య, వరలక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, దయాకర్, దామోదర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

అసంపూర్తిగా డ్రెయినేజీలు



తాడూరు: మండల కేంద్రంలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును అనుసరించుకుని నిర్మించిన డ్రెయినేజీలను అసంపూర్తిగా వదిలేయడంతో రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. మండల కేంద్రం నుంచి గగ్గలపల్లికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు పోచమ్మ టెంపుల్ నుంచి కాలేజీ వరకు పూర్తి చేయాల్సిన డ్రెయినేజీలను అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామపంచాయతీ చొరవ చూపి పూర్తి చేయాలని తాడూరు వాసులు కోరారు.

‘దళితబంధు’ అమలులో ప్రభుత్వం విఫలం

అచ్చంపేట రూరల్: ఎన్నికల సమయంలో టీఆర్‌ఎస్ పార్టీ ప్రజలను మభ్య పెడుతోందని, దళితబంధు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, అచ్చంపేట ఇన్‌చార్జ్ డాక్టర్ మోపతయ్య ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. దళితబంధు పథకాన్ని రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయకపోయినా సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా పథకాన్ని ప్రవేశపెడుతామని అనడం సిగ్గుచేటన్నారు. మొదట రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయిలో పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం పథకం అమలు చేసి ఎంత మంది లబ్ధిదారులకు అందించారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో టీడీపీ సభ విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చ మొదలైందన్నారు. రాష్ట్రం, అచ్చంపేటలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. వెంకటరమణ, సత్యనారాయణ, నిరంజన్, తిర్పతయ్య పాల్గొన్నారు.

పేదలకు సేవలందివ్వడమే లయన్స్ క్లబ్ లక్ష్యం

కల్వకుర్తి: సమాజంలోని అట్టడుగు నిరుపేదలకు సేవలు అందించడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని రాంరెడ్డి, కంటి ఆస్పత్రి చైర్మన్ డా. దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పశువుల సంతలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే అన్నదానం కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతలోని దాదాపు 500 మంది రైతులకు అన్నదానం చేశారు. ఆకలితో అలమటిస్తున్న వారి ఆకలి తీర్చేందుకు లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ 320ఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అన్నదానం కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నరేందర్‌రెడ్డి కుమార్తె అంకిత పుట్టిన రోజును పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ రమేష్ బాబు, చైర్మన్ వెంకటేష్, రామచంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం కార్యక్రమం ప్రారంభిస్తున్న దామోదర్‌రెడ్డి, సత్యం తదితరులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 2002-03 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపైన చదువుకున్న పాఠశాలలో హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో 20 సంవత్సరాల కిందట చదువుకున్న రోజులను నెమరువేసుకున్నారు. ఒక్కొక్కరు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల గ్రంథాలయానికి రూ.20 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు మోహన్న, బక్కయ్య, విశ్వనాథం, లచ్చమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

ప్రారంభానికి సిద్ధంగా గ్రామపంచాయతీ భవనం



తాడూరు: మండలంలోని అల్లాపూర్‌లో రూ.13 లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామంలో అందరికి అందుబాటు స్థలంలో ఉండాలనే ఉద్దేశంతో స్థలాన్ని ఎంపిక చేసి నిర్మించామని సర్పంచ్ నిరంజన్ తెలిపారు. మంజూరైన నిధులు నిర్మాణానికి చాలకపోవడంతో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కృషి, చొరవ కారణంగా నిర్మాణ పనులను పూర్తి చేశామన్నారు. పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా నిర్మాణం చేసిన అభివృద్ధి పనులను త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

సామాజిక సేవే లక్ష్యంగా సాగాలి

వెల్దండ: రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెల్దండ సమీపంలో చెన్నారెడ్డి ఫంక్షన్‌హాల్ పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. పేదప్రజలకు అండగా ఉండి సేవాలందించాలన్నారు. మానవసేవే మాదవసే అన్నట్లుగా సమాజంలోని పేదప్రజలను గుర్తించి వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అనంతనం నూతన సంవత్సర 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ యడ్మ సత్యం, కేవీఎన్ రెడ్డి, భూపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజితారెడ్డి, పావని, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

రెడ్డి సేవా సమితి కమిటీ ఎన్నిక



వెల్దండలో ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

వెల్దండ: చెన్నారెడ్డి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కల్వకుర్తి రెడ్డి సేవా సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుల శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అరవింద్ రెడ్డి, నర్సింహరెడ్డి, కోశాధికారిగా కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజేందర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, బోజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, అదేవిధంగా మహిళ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. వెల్దండ, కల్వకుర్తి, ఆమనగల్లు, కడ్తాల్, చారకొండ, మాడ్గుల నాయకులు ఉన్నారు.

ప్రమాదకరంగా కేఎల్‌ఐ కాల్వలు

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాలను కలిపే లింకురోడ్లను అడ్డంగ తవ్వి సాగు నీటి కోసం ఏర్పాటు చేసిన కేఎల్‌ఐ కాల్వలు ప్రమాదకరంగా మారాయి. ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లను అడ్డంగా తవ్వి ఉన్న ప్రదేశాల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇంద్రకల్ నుంచి సిర్సవాడ, ఐతోల్ మీదుగా జడ్చర్లకు వెళ్లే ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు ఇంద్రకల్ సమీపంలో తవ్విన కాల్వ దగ్గర్లో ఉండడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోయి రోడ్డు దగ్గరకు వచ్చింది. దీంతో మండలంలోని చర్లఇటిక్యాలకు చెందిన ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపుతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి బ్రిడ్జి నిర్మాణం పనులను చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా రోడ్డు పక్కన కాల్వ

మహనీయుల ఆశయ సాధనకు కృషి

వీపనగండ్ల: మహనీయుల ఆశయ సాధన కోసం పనిచేసినప్పుడే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహనీయుల మల్టీకలర్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ రామన్‌గౌడ్, కేవీపీఎస్ మండల కార్యదర్శి మురళి, ప్రజా సంఘాల నాయకులు స్వామి, ఆశన్న, ఈశ్వర్, శరత్, వెంకటేష్, రాము, గోపి, ముత్యాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలకు జమ చేయడం సరికాదు

పాన్‌గల్: రైతుబంధు డబ్బులను బ్యాంకు అధికారులు పాత బకాయిల కింద జమ చేసుకోవడం సరికాదని సీపీఐ జిల్లా మాజీ కౌన్సిల్ సభ్యుడు బాలస్వామి అన్నారు. ఆదివారం తెల్లరాళ్లపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల ఖాతాల్లో రైతుబంధు, ఇతర సంక్షేమ పథకాల నగదు జమ అయితే అట్టి నగదును బ్యాంకు అధికారులు రైతుల అప్పుల కింద జమ చేసుకుంటుండటంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం రైతుల రుణ మాఫీ చేయకపోవడంతో ఈ దుస్థితికి కారణం అన్నారు.

ఐద్వా జాతీయ మహాసభల్లో కందికొండ గీత

నాగర్‌కర్నూల్ రూరల్: కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో కొనసాగుతున్న ఐద్వా జాతీయ మహాసభల్లో నాగర్‌కర్నూల్ ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత పాల్గొన్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అక్కడి మహాసభల్లో మహిళా సమస్యలపై ఆ సంఘం ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలు నిర్వహించాలని తనకిచ్చిన ప్రసంగంలో మాట్లాడినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై చిన్నచూపు చూస్తున్నాయని, దాడులు పెరిగాయని, మహిళా హక్కులు కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.



మహాసభల్లో మాట్లాడుతున్న కందికొండ గీత

రాష్ట్ర మహాసభలకు తరలిన జర్నలిస్టులు

కందనూలు: హైదరాబాద్ పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ద్వితీయ మహాసభ, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఐజేయూ పదో ప్లీనరీకి జిల్లా నుంచి యూనియన్ నాయకులు, సభ్యులు భారీగా తరలివెళ్లారు. జిల్లాలోని అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాలతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి జర్నలిస్టులు తరలి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం టీయూడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ మహాసభలకు వెళ్లే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

